క్లుప్తంగా

నేడు కొత్తకొండకు మంత్రి పొన్నం రాక

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొత్తకొండకు మంగళవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలుగూరి రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తకొండలోని వీరభద్రస్వామి ఆలయంలో నక్షత్రదీక్ష చేపట్టి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

వేలేరు : మండలంలో ఎలాంటి ఘర్షణలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఎస్సై సురేశ్ హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా సహించేదిలేదని అన్నారు. గొడవలు, వివాదాలకు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా సూచించారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు



ఆత్మకూరు : యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సంతోశ్ తెలిపారు. పెంచికలపేట గ్రామానికి చెందిన ఉమ్మల్ల సందీప్‌పై ఇంటి పక్కన ఉండే వ్యక్తి ముదిగిరి రాజు ఇంటి గోడ నిర్మాణ విషయంలో ఉమ్మల్ల అరుణ, ఆమె కుమారుడు సందీప్‌పై దాడి చేయగా సందీప్ తలకు తీవ్ర గాయమయ్యింది. సోమవారం నిందితుడు రాజును అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 6న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్, అశోక జంక్షన్, గాంధీనగర్, టైలర్స్ స్ట్రీట్, కాకాజీకాలనీ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు, సిటిజన్ క్లబ్, మెడికవర్ ఆస్పత్రి, వాసవి కాలనీ, దుర్గాదేవి కాలనీ, భద్రకాళి బండ్, విశాల్ మార్ట్, హంటర్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

కేయూలో ఇద్దరికి డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఇద్దరు పరిశోధకులకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. తెలంగాణ గిరిజన కథా సంపుటాలు జనజీవన చిత్రణ అనే అంశంపై తెలుగు విభాగం పరిశోధకుడు బానోత్ స్వామి సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహచారి తెలిపారు. ఆ విభాగం ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి పర్యవేక్షణలో స్వామి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. అలాగే, కేకే రంగనాథ చార్యుల రచనలు – ఒక అధ్యయనం అనే అంశంపై తెలుగు విభాగానికి చెందిన జిడి రమేష్ సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు నర్సింహచారి పేర్కొన్నారు. ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి పర్యవేక్షణలో రమేష్ పీహెచ్‌డీ పూర్తిచేశారు.

అవార్డు ప్రదానం

కాజీపేట: రాష్ట్ర స్థాయి పర్యావరణ పరిరక్షకుడి అవార్డును కాజీపేట పట్టణానికి చెందిన కె.ప్రకాశ్ దక్కించుకున్నారు. గత కొన్నేళ్లుగా అటవీ ప్రాంతంతో పాటు రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటడం, గుట్టల్లో విత్తనాలు చల్లడం, ప్లాస్టిక్ నిర్మూలన, మట్టి గణపతుల ఏర్పాటు ఉద్యమంలో ప్రకాశ్ కీలక పాత్ర పోషించారు. ఆయన సేవలను గుర్తించిన ప్రజా హృదయం సోషల్ సర్వీస్ సొసైటీ సంస్థ రాష్ట్ర స్థాయి అవార్డుతో సన్మానించింది.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

ఖిలా వరంగల్: వరంగల్ 17వ డివిజన్ గాడిపల్లి గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ ఆధ్వర్యంలో 8మంది పేద విద్యార్థినులకు సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ గద్దె బాబు హాజరై విద్యార్థినులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకన్న, ఉపాధ్యాయులు ప్రవీణ్, పాపిరెడ్డి, నాయకులు దామోదర్, వీరస్వామి, హరీష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కాజీపేట అర్బన్: న్యూశాయంపేటలోని శ్రీరాజరాజేశ్వరి ఆటో యూనియన్ సభ్యుడు ఆటో డ్రైవర్ సత్తు శ్రీధర్ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబానికి యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం రూ.30 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు వేల్పుల సాంబమూర్తి, కోశాధికారి రాసమల్ల సురేష్, సత్యం, లక్ష్మణ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మానవాళికి మొక్కలే జీవనాధారం

- జెడ్పీ సీఈఓ విద్యాలత
- హోరెత్తిన స్వచ్ఛదనం- పచ్చదనం అవగాహన ర్యాలీలు
- మొక్కలు నాటిన అధికారులు



ఎల్కతుర్తి: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, జెడ్పీ సీఈఓ విద్యాలత

ఎల్కతుర్తి : మానవాళి మనుగడకు మొక్కలే జీవనాధారం అని జెడ్పీసీఈఓ విద్యాలత అన్నారు. సోమవారం ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కేజీబీవీ పాఠశాల విద్యార్థినులకు బుక్స్ పంపిణీ చేశారు. అలాగే భీమదేవరపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో నాయకులు, మహిళలు అధికారులు రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో గల పిచ్చిమొక్కలను తొలిగించి పూల మొక్కలు నాటారు. పీఆర్ డీఈ శిరీష, ఏఈ ఉమామహేశ్వర్, మండల స్పెషల్ ఆఫీసర్లు నాగేశ్వర్, శ్రీనివాస్, ఎంపీడీఓలు విజయ్‌కుమార్, వీరేశం, ఎంపీఓలు విమల, నాగరాజు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళలు, అధికార పార్టీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్ : మండలంలోని అన్ని గ్రామాల్లో వివిధ శాఖల అధికారులు శ్రమదానం చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి విద్యార్థులు, ప్రజలు, అధికారులు జిల్లా పరిషత్ బాలికల పాఠశాల వరకు స్వచ్ఛదనం- పచ్చదనంపై అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. అనంతరం రోడ్డు కిరువైపుల ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి శ్రమదానం చేశారు. విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. డీఆర్‌డీఓ నాగపద్మజ, ఎంపీడీఓ అనిల్ కుమార్, ఎంపీఓ సయ్యద్ అఫ్జల్ అన్ని గ్రామాల కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : ఆరోగ్య తెలంగాణగ రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి, ఎంపీడీఓ బాబు అన్నారు. మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించి అవగాహన ర్యాలీ తీశారు. ఎంజేపీ గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రవీందర్, ఈఓ రమణారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు రమేశ్‌గౌడ్, ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, స్వశక్తి సంఘాల మహిళలు, యువజన సంఘాల సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మండలంలోని వివిధ గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని తహసీల్దార్, గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి సుభాషిణి ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో గ్రామ స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈనెల 5వ తేదీన వన మహోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని, మొక్కలతోనే మానవాళికి మనుగడ లభిస్తుందన్నారు. ఎంపీఓ రంజిత్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీతారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నడికూడలో..

నడికూడ : మండల కేంద్రంలో ప్రత్యేకాధికారి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. సైడ్ డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను తీసి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రం చేశారు. జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు పర్యావరణం-మొక్కల పెంపకం-మన బాధ్యత అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాస్, పంచాయతీకార్యదర్శి సందీప్, పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : మండల కేంద్రంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల ప్రత్యేక అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు కోరారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సోమవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్యాలీ, గ్రామ సభలు నిర్వహించారు. డివిజనల్ పంచాయతీ అధికారి షరిఫొద్దీన్, తహసీల్దార్ జ్యోతివరలక్ష్మిదేవి, ఆర్ఐ సంపత్, ఏపీఓ శారద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి, ఈసీ రాజేశ్, టీఏ సురేందర్, పంచాయతీ కార్యదర్శులు నరేశ్, మనోహర్, శ్రీనివాస్, గ్రామ పంచాయతీ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు: స్వచ్ఛదనం-పచ్చదనంతోనే గ్రామాల అభివృద్ధి మండల ప్రత్యేకాధికారి రాజేందర్ అన్నారు. సోమవారం సమావేశం నిర్వహించి గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

పరకాలలో..

హన్మకొండ (పరకాల): పట్టణంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని సోమవారం 1వ వార్డు కౌన్సిలర్ మడికొండ సంపత్‌కుమార్, 10వ వార్డు కౌన్సిలర్ పసుల లావణ్య ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ ఇంజనీర్ రంజిత్‌కుమార్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రోహిత్‌కుమార్, వార్డు ఆఫీసర్ పాల్గొన్నారు.



దామెరలో..



నడికూడలో..



ధర్మసాగర్ : ర్యాలీలో పాల్గొన్న డీఆర్‌డీఓ నాగపద్మజ



కమలాపూర్ : మానవహారం చేపట్టిన విద్యార్థులు

విద్యుత్ పనుల్లో బాలలు



శాయంపేట : మండల కేంద్రంలో చేపట్టిన విద్యుత్ మరమ్మతు పనుల్లో సదరు కాంట్రాక్టర్ బాలకార్మికులతో పనులు చేపించడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాలను తొలిగిస్తున్న కాంట్రాక్టర్ శాయంపేట నుంచి మాందారిపేట వరకు పనులు చేపట్టారు. ఈ క్రమంలో నర్సంపేట సబ్ డివిజన్‌కు చెందిన 18 ఏళ్ల బాలకార్మికులతో పనులు చేపిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

బీఎన్ఆర్‌కేఎస్ ఆవిర్భావ దినోత్సవం



కమలాపూర్ : భవన నిర్మాణరంగాల కార్మిక సంఘం (బీఎన్ఆర్‌కేఎస్) 21వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ వద్ద బీఎన్ఆర్‌కేఎస్ మండల అధ్యక్షుడు పుల్ల శ్రీనివాస్ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులందరిని ఏకం చేసి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం నుంచి కార్మికులకు రావల్సిన బెనిఫిట్స్ సాధించేందుకు పోరాటం చేస్తామన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేయాలని, 50 ఏళ్లు దాటిన తాపీ మేస్త్రీలకు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పుల్ల కొమురయ్య, మాట్ల ఐలయ్య, మాట్ల రాజేందర్, పుల్ల ఐలయ్య, పుల్ల పున్నం, మాట్ల కుమార్, బండి లక్ష్మణ్, రావుల సమ్మయ్యతో పాటు స్థానికులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది

ఐనవోలు : దాతల సహకారం మరువలేనిదని పున్నేలు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాయరాకుల పరమేశ్వర్ అన్నారు. సోమవారం దాత ముక్కెర అనిల్ రెడ్డి ఆర్థిక సహకారంతో 120 మంది విద్యార్థులకు రూ.15 వేలు విలువచేసే నోట్‌బుక్స్, స్టేషనరీని అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. దాతలు ముందుకు వచ్చి పాఠశాలను మరింత అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో దాత సోదరుడు సురేశ్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం మాధవి, జీపీ కార్యదర్శి అశోక్, కారోబార్ నిరంజన్, ఏఏపీసీ కమిటీ సభ్యులు, జన్ను రాజు, రాజు, ఉపాధ్యాయులు యాకయ్య, అన్నారెడ్డి, ఇందిరా, వెంకటయ్య, స్వప్న, నిర్మల, సుభద్ర, విమలతో పాటు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న హెచ్‌ఎం

సుప్రీంకోర్టు తీర్పు అభినందనీయం

ఐనవోలు : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు ఆమోదం తెలుపుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి దళిత సంఘాలు, స్థానిక నాయకులతో కలిసి పాలాభిషేకం నిర్వహించారు. సుప్రీంకోర్టు గొప్ప తీర్పును వెలువరించిందని, దళితుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ మద్దతిస్తుందన్నారు. 30 ఏళ్ల కళ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అని, అది సాకారం దిశగా అడుగులు వేయడం శుభపరిణామం అన్నారు. జన్ను కుమారస్వామి, కొత్తూరి సునీల్, భాస్కర్, రాజయ్య, మునిగాల సమ్మయ్య, బొల్లెపల్లి శ్రీనివాస్, యక్షగాన కళాకారులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ధర్నా



పరకాల - హుజూరాబాద్ ప్రధాన రోడ్డుపై ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

నడికూడ : మండలంలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని పరకాల-హుజూరాబాద్ ప్రధాన రోడ్డుపై ధర్నా నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి మాట్లాడుతూ.. నడికూడను 15 గ్రామాలతో నూతన మండలంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. అభివృద్ధి పనులు మాత్రం మరిచిందని విమర్శించారు. పక్కా భవనాలు లేక మండల కేంద్రంలో ఇంతవరకు ప్రభుత్వ కార్యాలయాలు లేవని అన్నారు. ఎంపీడీఓ కార్యాలయానికి పక్కా భవనం ఏర్పాటు చేయాలని, కంఠాత్మకూరు హైలెవల్ బ్రిడ్జ్ త్వరగా పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పగడాల కాశీప్రసాద్, మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, సత్యనారాయణ, గురుప్రసాద్, రాజవీరు పాల్గొన్నారు.

ఆయుర్వేద ఆస్పత్రిలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఆయుర్వేద వైద్య విద్యార్థులు

కాశిబుగ్గ: తలసేమియా బాధితులను ఆదుకోడానికి దాతలు ముందుకు రావాలని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ పద్మావతి కోరారు. ఈమేరకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటరీల సహకారంతో వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాలలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం మరొకరికి ప్రాణదానమని, ఆరోగ్యంగా ఉన్న ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని సూచించారు. ఈ శిబిరంలో 30 మంది వైద్య విద్యార్థులు, వైద్యులు, సిబ్బంది రక్తదానం చేశారు. శిబిరంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌కుమార్, వైద్యులు జగన్మోహనచారి, హరికిషన్, మహేష్ పాల్గొన్నారు.

ఆసక్తి ఉన్న సంస్థలకు ఆహ్వానం

న్యూశాయంపేట: వరంగల్ జిల్లా పరిధిలోని రంగశాయిపేట శివారు జక్కలొద్ది మైనారిటీ గురుకులంలో నిరుపయోగమైన వస్తువులు (నోట్‌బుక్స్, న్యూస్ పేపర్, ప్లాస్టిక్ వస్తువులు) కొనుగోలు చేసేందుకు ఆసక్తి గల సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.భిక్షపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9లోపు గురుకులంలోని కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

భావ వ్యక్తీకరణలో భాష ప్రధానం

కేయూ క్యాంపస్: భావ వ్యక్తీకరణంలో భాష ప్రధాన భూమిక పోషిస్తుందని సెల్ట్ డైరెక్టర్ డాక్టర్ మేఘనారావు అన్నారు. విశ్వవిద్యాలయంలో సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్) ఆధ్వర్యంలో 40 రోజులపాటు నిర్వహించే స్పోకెన్ ఇంగ్లిష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో మాట్లాడారు.

దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగం హేయమైన చర్య

హన్మకొండ: దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం హేయమైన చర్య అని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు థర్డ్ డిగ్రీ ప్రయోగించిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ సైబరాబాద్ పరిధి షాద్‌నగర్ పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన సునీత, భీమయ్య దంపతులను ఓ దొంగతనం ఆరోపణలపై పోలీసులు అదుపులోకి తీసుకున్నారని పేర్కొన్నారు. ఆ దళిత మహిళపై చెప్పలేని రీతిలో జై భీమ్ సినిమా తరహాలో పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని తెలిపారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రొంటాల దేవ డిమాండ్ చేశారు. ఓ దొంగతనం కేసులో అరెస్టు చేసి తీవ్రంగా వేధించారని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కుంకుమేశ్వరస్వామి ఆలయంలో పూజలు



హన్మకొండ (పరకాల) : శ్రావణమాసం మొదటి సోమవారం సందర్భంగా పరకాల పట్టణంలోని కుంకుమేశ్వరస్వామి ఆలయంలో భక్తుల కోలాహలం నెలకొంది. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో బారులుదీరారు. ఆలయ ప్రధాన అర్చకుడు కోమాళ్లపల్లి నాగభూషణం శర్మ, సంపత్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వాదం అందించారు. కుంకుమేశ్వరాలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది.

ముర్రుపాలతో రోగనిరోధక శక్తి



శాయంపేట : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు



నడికూడ : తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు

శాయంపేట : బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి ముర్రుపాలను పట్టించడం వలన బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని తహసీల్దార్ సుభాషిణి అన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీతారెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించగా ఆమె హాజరై మాట్లాడారు. బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకు తల్లిపాలను తాగించాలని అన్నారు. ఆరు నెలల అనంతరం తల్లిపాలతో పాటు అదనపు ఆహారాన్ని అందించాలని సూచించారు. అనంతరం సూపర్‌వైజర్ సునీతారెడ్డి తల్లుల ఇంటి వద్దకు వెళ్లి పౌష్టికాహారాన్ని తీసుకుంటున్నారా.. లేదా అని ఆరా తీశారు. గర్భిణలకు పలు సూచనలు చేశారు. ఈ అంగన్‌వాడీ టీచర్లు రత్నమాల, జ్యోత్స్న, పుష్ప, శ్వేత, అరుణ పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండల కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి రాజేందర్ పాల్గొని పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, ప్రధానోపాధ్యాయుడు రాజు, అంగన్‌వాడీ టీచర్లు దేవమ్మ, వాణి, పుష్పలీల, పద్మ పాల్గొన్నారు.

నడికూడలో..

నడకూడ : మండల కేంద్రంలోని 1,2,3 అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరిగాయి. బాలింతలకు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతను సూపర్‌వైజర్ శ్రీదేవి వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు అనిత, సంపూర్ణ, వినోద, కళావతి ఆయాలు నర్సమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వెల్‌నెస్ సెంటర్ డాక్టర్ అపర్ణ 82 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. దళిత కాలనీలో దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉంటే దోమలు ప్రబలుతాయని, దోమకాటుతో మలేరియా, టైఫాయిడ్, డెంగీ బారినపడే అవకాశం ఉంటుందని ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. హెచ్ఈఓ వెంకటేశ్వరవర్మ, సూపర్‌వైజర్లు భద్రయ్య, మల్లేశం, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాస్, చలపతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సీఎంను కలిసిన కోగిల్వాయి వాసి

దామెర : మండలంలోని కోగిల్వాయి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ గట్ల రవీందర్‌రెడ్డి సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అమెరికాలోని ఫిలడెల్ఫియాలోని కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్న రవీందర్‌రెడ్డి అమెరికా పర్యటలో ఉన్న రేవంత్‌రెడ్డిని కలిశారు. రవీందర్‌రెడ్డి తెలంగాణ తెలుగు అసోసియేషన్(టీటీఏ)లో రీజనల్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నారు. కాగా సీఎం పలు అంశాలపై చర్చించారు.

